సాక్షి ప్రకాశం



పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్పీ దామోదర్ అన్నారు. - 10లో..



సమాజం పట్ల బాధ్యత అవసరం

సమాజం పట్ల విద్యార్థులకు బాధ్యత అవసరమని జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ అన్నారు. జార్జ్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థుల ఫ్రెషర్స్ డేలో ఆమె మాట్లాడారు. - 10లో..

గరిష్టం/కనిష్టం 35/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

కార్యకర్తలకు అందుబాటులో బూచేపల్లి



ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి 26వ తేదీ శనివారం అందుబాటులో ఉంటారని పార్టీ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారన్నారు.

సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ పై ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ పై రూడ్‌సెట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆ సంస్థ డైరక్టర్ శ్రీనివాస రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ నవంబర్ 4 నుంచి 16వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు యువకులు ఈ శిక్షణకు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాలతో కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8247387644 నంబరకు ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

27న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ఒంగోలు టౌన్: జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల 27వ తేదీ చీమకుర్తిలోని చీమకుర్తి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండ్లా శ్రీనివాసరావు, సీహెచ్. జయప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1వ తేదీ నిర్వహించిన చెకుముకి సైన్స్ పోటీల్లో మొదటి స్థానం సాధించిన ఉన్నత పాఠశాల విద్యార్థి బృందాలు ఈ పోటీలకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9440522775, 9849868311లకు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ప్రారంభమైన పశుగణన



పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పశుసంవర్థక శాఖ అధికారులు

ఒంగోలు అర్బన్: 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా నివాసంలో ప్రారంభించారు. శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో, పట్టణాల్లో ఈ పశుగణన కార్యక్రమం ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ శాఖ జేడీ బేబిరాణి కలెక్టర్ నివాసంలో తన సిబ్బందితో కలిసి వివరాలు సేకరించారు. వివరాలు సేకరించినట్లు కలెక్టర్ నివాసానికి స్టిక్కర్‌ను అంటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో ప్రతి ఇంటిని సందర్శించి పశుగణన సమగ్ర సమాచారాన్ని సేకరించాలని సూచించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జేసీ

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూములు ఆక్రమణలకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అవసరాల కోసం వివిధ శాఖలకు కేటాయించిన భూముల స్థితిగతులపై సమీక్షించారు. ఎటువంటి ఆక్రమణలు జరగలేదని అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ ఇతర అవసరాలకు భూములు కావాలంటే తెలియజేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్‌డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న ఇతర అధికారులు పాల్గొన్నారు.

కంభం

గుండె చెరువు..

శతాబ్దాల చారిత్రక నేపథ్యమున్న కంభం చెరువు నేడు కళతప్పింది. ఆసియాలోనే రెండో అతి పెద్ద చెరువు. ప్రకృతి రమణీయత దీని సొంతం. పర్యాటకుల స్వర్గధామం. ఇంతటి ప్రత్యేకతలు సంతరించుకున్న వారసత్వ సంపద పర్యవేక్షణలేక నిర్లక్ష్యానికి గురవుతోంది. వేలాది ఎకరాలకు సాగునీరు, చాలా గ్రామాలకు తాగునీరు అందించే ఈ చెరువు అభివృద్ధికి నోచుకోక ప్రాభవాన్ని కోల్పోతోంది. చెరువు చుట్టూ పచ్చని కొండలు, ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. అధికారులు సైతం దీనిని పట్టించుకోకపోవడంతో పలు ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైంది. పర్యాటకంగా దీనిని అభివృద్ధి చేసే దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

- అభివృద్ధికి దూరంగా వారసత్వ సంపద
- పడిపోతున్న నీటి మట్టం
- అడుగడుగునా ఆక్రమణలు, కుంచించుకుపోతున్న కాల్వలు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా చెరువు పరిసరాలు
- అందని ద్రాక్షలా పర్యాటక అభివృద్ధి
- చెరువును పట్టించుకోని అధికారులు



కంభం చెరువు వ్యూ

కంభం: ప్రపంచ సాగునీటి వారసత్వ కట్టడంగా పేరు పొందిన కంభం చెరువును 15వ శతాబ్దంలో గుండ్లకమ్మ, జంపలేరు వాగుల వరద ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ శ్రీకృష్ణదేవరాయలు సతీమణి వరద రాజమ్మ నిర్మించారు. నాడు 40 అడుగుల లోతు ఉన్న కంభం చెరువు నిండితే మూడేళ్ల పాటు రైతులు వ్యవసాయం చేసుకునే వారు. కాల క్రమేణా చెరువులో పూడిక చేరి నీటి నిల్వసామర్థ్యం తగ్గిపోతూ వస్తోంది. ప్రస్తుతం 21 అడుగులకు చేరడంతో చెరువు నిండినా రెండు పంటలకే నీళ్లు సరిపోతున్నాయి. చెరువు నిర్మించిన తర్వాత ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నిండి అలుగు పారింది 11 సార్లు మాత్రమే. ప్రస్తుతం చెరువులో 9.5 అడుగుల మేర నీరు ఉంది. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసినా కంభం చెరువుకు మాత్రం చుక్కనీరు కూడా రాలేదు. ఆయకట్టు రైతులు వరి సాగుకు చెరువు నీళ్లు వదలాలని ఇరిగేషన్ అధికారుల వద్దకు వెళ్లి అడిగినా నీళ్లు తక్కువగా ఉన్నాయని, అవి అయిపోతే భూగర్భ జలాలు తగ్గి ప్రజలకు మంచినీటి సమస్య ఏర్పడుతుందన్న ఉద్దేశంతో నీళ్లు వదల్లేదు. దీంతో చేసేదేమీ లేక రైతులు మిన్నకుండిపోయారు. బోర్లు ఉన్న రైతులు వాటి సహాయంతో పంటలు సాగు చేసుకుంటున్నారు. కంభం మండలంలోని కంభం, చిన్నకంభం, పోరుమామిళ్లపల్లి, దర్గా, కందులాపురం, నడింపల్లి, ఔరంగబాదు, యల్‌కోట, సూర్యపల్లి, హజరత్‌గూడెం, బేస్తవారిపేట మండలంలోని జేబీకేపురం, చింతలపాలెం, సోమవారిపేట, బేస్తవారిపేట, పాపాయపల్లి గ్రామాలకు సాగునీరందుతుంది. కంభం చెరువులో నీరుంటే వీటితో పాటు అర్థవీడు, తర్లుపాడు, మార్కాపురం మండలాల్లో కూడా భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి.

అభివృద్ధికి దూరంగా..

చారిత్రాత్మక కంభం చెరువు అడుగడుగునా నిర్లక్ష్యానికి గురవుతోంది. 2011వ సంవత్సరంలో కంభం చెరువు ఆధునికీకరణ కోసం జపాన్ (జేబీసీఏ) నిధులు రూ.11.97 కోట్లు మంజూరయ్యాయి. అయితే అధికారులు, పాలకులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో అవి ఆవిరైపోయాయి. 2011 నవంబరులో పనులకు శంకుస్థాపన జరిగింది. రెండేళ్ల కాల పరిమితిలో సైడ్ వాల్స్ 7471 మీటర్లు, బెడ్‌లైనింగ్ 4638 చ.మీ, 84 తూముల మరమ్మతులు, 9 వంతెనలు, డ్రాప్స్ 11, దోబిఘాట్‌లు 2, అక్విడక్ట్ 1, 2 ప్రధాన తూముల మరమ్మతులు, నక్కల గండి ప్రధాన తూముల మరమ్మతు, ఫ్లడ్ మానిటరింగ్ బిల్డింగ్ మరమ్మతులు, ఇంకా కొన్ని ఇతర పనులు పూర్తిచేయాల్సి ఉంది. పనులు నత్తనడకన సాగడంతో అవి పూర్తయ్యేసరికి ఐదేళ్లకాలం పట్టింది. ఆ పనులు సైతం పూర్తి స్థాయిలో జరగలేదు. ఫలితంగా చెరువు అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది.

పర్యాటకంగానూ..

ఏళ్ల చరిత్ర కలిగిన కంభం చెరువును చూసేందుకు, ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు నిత్యం పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. కంభం చెరువు కట్టపై వరదరాజమ్మ ఆలయం, దీనాషావలి దర్గా, శ్రీకృష్ణదేవరాయలు, వరదరాజమ్మ విగ్రహాలతో సర్వమత సమ్మేళనాన్ని రూపొందించుకుంది. చెరువు కట్టపై తేజతేరి, వినాయకచవితి నిమజ్జన వేడుకలు ఘనంగా జరుపుకుంటారు. సెలవు రోజుల్లో, ఆదివారాలు ప్రజలు కుటుంబ సభ్యులతో కలసి చెరువుకట్టపైకి వచ్చి వెళ్తుంటారు. సందర్శకులకు మౌలిక వసతుల కల్పన, బోటింగ్, చెరువు మధ్య ఉన్న కొండల్లో రిసార్ట్స్ నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. పర్యాటక కేంద్రంగా మార్చాలన్నది ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక కలగానే మిగిలిపోతోంది.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

చెరువు కట్టపై ఉన్న పరిసరాలు అధ్వానంగామారి మందు బాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోతోంది. కట్టపై విశ్రాంతి తీసుకోవడం నిర్మించిన ఓ భవనం నేడు మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలు కట్టపైనే పడేయడం, చిల్లచెట్లు నిండిపోవడంతో కట్టపైకి వచ్చే సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు చెరువు కట్టను పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెరువుకట్టపై నిరుపయోగంగా ఉన్న భవనం



దెబ్బతిన్న చెరువుకట్టలోని ఓ భాగం

కంభం చెరువును అభివృద్ధి చేయాలి



పశ్చిమ ప్రకాశంలో కంభం చెరువు మీద ఆధారపడి వేలాది మంది రైతులు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. పురాతన కంభం చెరువు శిథిలావస్థకు చేరిపోతుండటం బాధాకరం. ఉన్నతాధికారులు స్పందించి చెరువుకు మరమ్మతులు చేయించి అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– నెమలిదిన్నె చెన్నారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, కంభం

కంభం చెరువు సామర్థ్యం 3.30 టీఎంసీలు

అలుగు పొడవు	మట్టి కట్ట పొడవు
88.40 మీటర్లు	295.65 మీటర్లు
కట్ట ఎత్తు	**చెరువు వైశాల్యం**
18.5 మీటర్లు	6025 ఎకరాలు

మొత్తం సాగు విస్తీర్ణం :

అధికారికంగా	అనధికారికంగా
6944 వేల ఎకరాలు	12 వేల ఎకరాలు

ఆక్రమణలు ఇలా..

కంభం చెరువు ఆయకట్టు కింద చిన్నకంభం, పెద్దకంభం, నక్కల గండి తూముల ద్వారా ప్రధాన పంటకాల్వలు వెళ్తాయి. పెద్దకంభం, నక్కల గండి తూముల ద్వారా వెళ్లే కాల్వ పట్టణంలోని నడి బొడ్డు నుంచి వెళ్తుండగా అర్థవీడు రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, బస్టాండు వెనుక, హైవేకు ఇరువైపులా ఇరిగేషన్ స్థలాలను ఆక్రమణదారులు దర్జాగా ఆక్రమించుకొని శాశ్వత కట్టడాలు నిర్మించుకున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పలు చోట్ల వెంచర్లకు ఆనుకొని ఉన్న పంట కాల్వలను ఆక్రమించుకున్నారు. పంటకాల్వల్లో పూడిక, చిల్లచెట్లు, వ్యర్థాలు నిండిపోయి నీరు పారే మార్గం మూసుకుపోయింది. ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా, కాల్వలు పూడిపోతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.



ఆక్రమణలతో కుంచించుకుపోయిన ప్రధాన పంటకాల్వ

కిరాయి హంతకులతో హత్యాయత్నం

- రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మనస్పర్థలతో మాజీ పార్టనర్‌పై కక్ష
- ఓంకార్‌ను అంతమొందించేందుకు రూ.8 లక్షల కిరాయి
- నిందితులలో గ్రే హౌండ్ కానిస్టేబుల్ ఇట్లా భాస్కర్ రావు
- పరారీలో ప్రధాన నిందితుడు రమేష్
- సంచలనం సృష్టించిన కేసులో నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

ఒంగోలు టౌన్:

జిల్లాలో సంచలనం సృష్టించిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పెమ్మని ఓంకార్ హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ వివరాలు వెల్లడించారు. పొదిలికి చెందిన పొమ్మని ఓంకార్, పొల్లా రమేష్‌లు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. కొంతకాలం తరువాత భాగస్వాముల మధ్య విభేదాలు పొడచూపాయి. దాంతో ఇద్దరూ విడిపోయి ఎవరి వ్యాపారాలు వారు చేసుకుంటున్నారు. వారిద్దరూ కలిసి ఉన్నప్పుడు రమేష్ పోతవరం గ్రామంలో కొంతమంది దగ్గర డబ్బులు అప్పు చేశాడు. అప్పుడు ఓంకార్ మధ్యవర్తిగా ఉన్నాడు. ఈ ఇద్దరూ విడిపోయిన తరువాత పోతవరం గ్రామస్తులు కోర్టులో కేసు వేశారు. అయితే ఈ కేసును ఓంకార్ వేయించినట్లుగా అనుమానించిన రమేష్ అతడిపై కక్ష పెంచుకున్నాడు. అంతేకాకుండా ఇటీవల పొదిలి మండలం కొష్టాలపల్లి గ్రామానికి చెందిన దొండ్ల రామిరెడ్డి అనే వ్యక్తితో కలిసి వ్యాపారం చేయసాగాడు. రమేష్, రామిరెడ్డి కలిసి కొన్న పొలాల విషయంలో నష్టాలు వచ్చాయి. ఓంకార్ వల్లనే తమ వ్యాపారం దెబ్బతింటుందని భావించిన ఈ ఇద్దరూ ఎలాగైనా సరే ఓంకార్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. నేరుగా తామే నేరం చేస్తే పోలీసులకు దొరికిపోతామని కిరాయి మనుషుల ద్వారా పనికానించాలని పథకం పన్నారు. ఈ క్రమంలో రమేష్‌కు హైదరాబాద్‌లో గ్రే హౌండ్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇట్లా భాస్కరరావు పరిచయం అయ్యాడు. అతడికి దర్శి మండలంలో 3 ఎకరాల పొలాన్ని ఆన్‌లైన్ చేయించాడు. ఇంకా అతడికి భారీ మొత్తంలో ఆశ చూపించడంతో అతడు ఓంకార్‌ను హత్య చేయించేందుకు అంగీకరించాడు. భాస్కరరావు అతడి మేనల్లుడైన కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన సిసింద్రి ఉరఫ్ శశి, అతడి మిత్రుడైన నాయబ్ రసూల్, బాల శివ ప్రసాద్‌లను కిరాయికి ఒప్పించాడు. ఓంకార్‌ను హతమార్చేందుకు గాను రూ.8 లక్షల కిరాయి కుదుర్చుకున్న భాస్కర్‌రావు బృందంలోని సభ్యులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడు. ఈ నలుగురు ఒక బృందంగా ఏర్పడి ఓంకార్‌పై అనేకసార్లు హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. చివరగా ఈ నెల 5వ తేదీ రాత్రి 10.50 గంటలకు ఇంటికి వెళుతున్న ఓంకార్‌పై దాడి చేశారు. ఇనుపరాడ్లతో ఇష్టం వచ్చినట్లు కొట్టారు. తలమీద, ఒంటిమీద విచక్షణా రహితంగా కొట్టడంతో ఓంకార్ స్పృహ కోల్పోయాడు. దాంతో అతడు మరణించాడని భావించిన కిరాయి హంతకుల బృందం అక్కడ నుంచి పరారైంది. అయితే అతను ప్రాణాలతోనే ఉన్నాడు. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు భాస్కర్‌రావు బృందం ఒక ప్లాన్ సిద్ధం చేసింది. ఈ కేసును ఎవరైనా అంగీకరిస్తే ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇస్తానంటూ నమ్మించాడు. వారికి ఎలాంటి నష్టం జరగకుండా తాను పోలీసులతో మాట్లాడినట్లు చెప్పాడు. అలా నలుగురు వ్యక్తులను నమ్మించిన భాస్కర్‌రావు వారిని పోలీసు స్టేషన్‌కు పంపించాడు. పోలీసులు వారి మాటలను విశ్వసించలేదు. తమదైన శైలిలో విచారణ జరిపి అసలు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రమేష్ పరారీలో ఉన్నాడు. మిగిలిన వారిని శుక్రవారం పొదిలిలోని ఒక ప్రైవేటు స్కూలు వద్ద అరెస్టు చేశారు. రెండు బైకులు, రూ.40,500, నాలుగు ఐరన్ రాడ్లను స్వాధీనం చేసుకున్నారు. కిరాయి హంతకుల ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన దర్శి డీఎస్పీ లక్ష్మి నారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమనలను ప్రత్యేకంగా అభినందించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

భూగర్భ జలాలను పెంపొందించాలి

- నీటి సంరక్షణ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్:

భూగర్భ జలాలను పెంపొందించాలని అందుకు అవసరమైన నీటి సంరక్షణ చర్యలు తీసుకుని, వాటిలో ప్రజలను భాగస్వాములు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ హాలులో శుక్రవారం జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో భూగర్భ జలాల పెంపునకు చేపట్టాల్సిన నీటి సంరక్షణ చర్యలపై ఎంపీడీవో, ఈఓపీఆర్‌డీ, ఏపీవోలు, ఏపీఎంలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 57 గ్రామాల్లో పరిమితికి మించి భూగర్భ జలాలు వినియోగించినట్లు గుర్తించారన్నారు. వాటిలో కొన్ని గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్, ఎఫర్డ్ సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాయని చెప్పారు. తప్పనిసరిగా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి విలేజ్ వాటర్ బడ్జెట్ ప్రణాళిక రూపకల్పన చేపట్టాలని సూచించారు. ప్రభుత్వాలు నీటి సంరక్షణకు ఇంకుడు గుంత నిర్మాణాలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫారంపాండ్ నిర్మాణాలు వంటి పలు కార్యక్రమాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తుందన్నారు. కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి మరింత విస్తృతపరచాలన్నారు. జిల్లాలో 33 వేల ఇంకుడు గుంతల నిర్మాణాలకు అనుమతి ఇచ్చారన్నారు. మండలానికి వెయ్యి ఇంకుడు గుంటలు నిర్మించేలా లక్ష్యాన్ని నిర్దేశించడంతో పాటు ఒకే రోజు జిల్లాలోని ప్రతి పంచాయతీలో నమూనా ఇంకుడు గుంట నిర్మించాలని సూచించారు. జిల్లాలో ప్రతి ప్రభుత్వ భవనంపై రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం చేపట్టాలన్నారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు అవగాహన కల్పించి ఫారం పాండ్ నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా రూపొందించిన జిల్లా, విలేజ్ వాటర్ బడ్జెట్ ప్రణాళిక గురించి రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట బాబురావు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అదేవిధంగా డ్వామా ఇంజినీరింగ్ అధికారులు ఇంకుడు గుంటలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలపై వివరించారు. దీనిలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, భూగర్భ జలాల శాఖ డీడీ విద్యాసాగర్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ, మెప్మా, ఏపీఎంఐపీ పీడీలు వసుంధర, రవికుమార్, రమణ, మున్సిపల్ కమిషనర్ వెంకటే/ శ్వరరావు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



నీటి సంరక్షణ చర్యలపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బడుగుజీవిపై పచ్చ కక్ష

- స్కూల్లో 11 ఏళ్లుగా పనిచేస్తున్న దళిత శానిటరీ వర్కర్ తొలగింపు

కంభం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిరుద్యోగులని కూడా చూడకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో పరిస్థితులు ఇంకా దారుణంగా మారిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో 11 ఏళ్లుగా శానిటరీ వర్కర్‌గా పనిచేస్తూ వచ్చే అరకొర జీతంతో మానసిక వికలాంగుడైన కుమారుడిని పోషించుకుంటూ బతుకుతున్న దళిత వితంతు మహిళను టీడీపీ నాయకుల ఒత్తిడితో విద్యాశాఖాధికారులు తొలగించడం వారి దాష్టీకానికి నిదర్శనంగా నిలుస్తోంది. మండలంలోని చిన్నకంభం ప్రభుత్వ పాఠశాలలో 11 సంవత్సరాలుగా శానిటరీ వర్కర్‌గా పనిచేస్తున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గుర్రం భాగ్యానికి భర్త 23 ఏళ్ల క్రితం చనిపోయాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మానసిక వికలాంగుడు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే సదరమ్ సర్టిఫికెట్‌లో అంగవైకల్య శాతం సరిపోలేదంటూ పింఛన్ రాలేదు. అప్పట్లో వెయ్యి రూపాయల జీతం ఉండగా ప్రస్తుతం రూ.6 వేల జీతం వస్తోంది. వచ్చే కొద్దిపాటి జీతంతో కొడుక్కి మందులు ఇప్పించుకుంటూ జీవనం సాగిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలనే నెపంతో పదకొండేళ్లుగా పాఠశాలలో పనిచేస్తున్న ఆమెను తొలగించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పట్టుబట్టారు. వారి ఒత్తిడితో విద్యాశాఖాధికారులు ఆమెను తొలగించాలని నిర్ణయించుకుని ''ఇక నువ్వు స్కూల్‌కు రావొద్దు.. నీస్థానంలో వేరొకరిని నియమించాం'' అని చెప్పారని, శుక్రవారం గ్రామానికి చెందిన మరో మహిళ స్కూల్‌కు శానిటరీ పనిచేసేందుకు వెళ్లిందని దీంతో తాను రోడ్డున పడ్డానని భాగ్యం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.



మానసిక వికలాంగుడైన కుమారుడితో శానిటరీ వర్కర్ గుర్రం భాగ్యం

క్లుప్తంగా

జీజీహెచ్ ఆర్ఎంఓగా డాక్టర్ మాధవీలత



డాక్టర్ మాధవీలతకు అభినందనలు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

ఒంగోలు టౌన్: ఒంగోలు సర్వజన ఆస్పత్రి ఆర్ఎంఓగా డాక్టర్ మాధవీలతను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె జిల్లా మలేరియా అధికారిగా, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వై. సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి కె. శ్రీధర్‌బాబు, కోశాధికారి జి. నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి. కృష్ణ, సంయుక్త కార్యదర్శి స్మితామోల్ ఆమెకు అభినందనలు తెలిపారు.

ఉచిత ఇసుక పారదర్శకంగా సరఫరా చేయాలి



వీడియో సమావేశంలో కలెక్టర్, జేసీ

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుకను పారదర్శకంగా సరఫరా చేయాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీన సూచించారు. ఉచిత ఇసుక విధానంపై శుక్రవారం రాత్రి అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఇసుక పాలసీ మార్గదర్శకాల ప్రకారం కచ్చితంగా ఇసుకను సరఫరా చేయాలన్నారు. ఇసుక సరఫరాపై కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రకాశంభవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై అంకమరావు

మార్కాపురం రూరల్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని బొడిచర్లలో శుక్రవారం జరిగింది. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గాయం సాంబశివారెడ్డి (36) ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లోనే ఉంటున్నాడు. మృతుని భార్య దీప్తి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఖర్చులకు డబ్బులివ్వాలని భార్యను అడుగుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మృతుడు సాంబశివారెడ్డి భార్యను డబ్బులు అడగ్గా..నా వద్ద లేవని చెప్పడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మార్కాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి



నీటి కుంటలో తేలియాడుతున్న చిన్న హుస్సేన్ మృతదేహం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల వెనకాల వైపు ఉన్న కొండ ప్రాంతంలో నీటి కుంటలో అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..నల్లబండ బజారుకు చెందిన బేల్దారీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే బాష కుమారుడు షేక్.చిన్నహుస్సేన్ (14) స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గురువారం రాత్రి కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం నీటి కుంటలో బాలుడి మృతదేహం పైకి రావడంతో స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు బంధువులతో కలిసి నీటి కుంట వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున విలపించారు. స్నేహితులతో కలిసి ఈతకు వచ్చి మరణించాడని కొందరు చెప్పుండగా..తల్లిదండ్రులు మాత్రం స్నేహితులే కలిసి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాతకు అండగా..!

- రైతుల సేవలో పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య
- నష్టాల్లో ఉన్న పొగాకు సమాఖ్యను లాభాల బాట పట్టించిన చైర్మన్ వాకా బసివిరెడ్డి
- నాగులుప్పలపాడులో రూ.2 కోట్లతో గోడౌన్ నిర్మాణం
- త్రిపురాంతకంలోనూ రైతుల కోసం బ్రాంచ్ ఏర్పాటు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సహకారంతో ముందుకెళ్లిన సమాఖ్య



రైతులకు ఎరువులు అందిస్తున్న చైర్మన్ వాకా బసివి రెడ్డి, పొగాకు వేలం కేంద్రాల అధికారులు

ఒంగోలు సబర్బన్:

మార్కెట్ సంక్షోభంలోనూ వ్యాపారులు, దళారుల నుంచి రైతులను ఆదుకుంటూ అండగా నిలుస్తోంది పొగాకు వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సమాఖ్యను రైతుల చెంతకు చేర్చి అప్పటి నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అందజేస్తూ రైతులకు చేదోడుగా పనిచేస్తోంది. ఎరువులు, పురుగుమందులు అందజేయడంతో పాటు ధాన్యం ఇతర పంటలను నేరుగా పొలంలో కల్లాల వద్ద సమాఖ్య స్వయంగా కొనుగోలు చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సకాలంలో అందిస్తూ ఆదుకుంటోంది. ఇటీవల డీసీఎంఎస్‌లో అక్రమాలు జరగడంతో ఆ సంస్థలోని అధికారులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. దీంతో డీసీఎంఎస్ ద్వారా రైతులకు అందించాల్సిన సేవలను ప్రభుత్వం పొగాకు వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్యకు అందించింది. దీంతో చైర్మన్ బసివిరెడ్డి శుక్రవారం పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని పొగాకు రైతులకు ఎరువులను పంపిణీ చేశారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో..

పొగాకు, పత్తి కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో 1984 ఏప్రిల్ 16న ఒంగోలు ది ఆంధ్రప్రదేశ్ పొగాకు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య ఏర్పాటైంది. ఒంగోలు కేంద్రంగా ఏర్పాటు చేశారు. ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుంచి పొగాకు, పత్తి రైతులను ఆదుకుంటూ సమాఖ్య ముందుకు సాగుతోంది. 2019లో వైఎస్సార్ సీపీ నాయకుడు వాకా బసివిరెడ్డి చైర్మన్‌గా నూతన కమిటీని అప్పట్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నాగులుప్పలపాడు మండల కేంద్రంలో సొంతంగా స్థలాన్ని తీసుకుని దాదాపు రూ. 2 కోట్లతో గోడౌన్ నిర్మించుకున్నారు. ఆ ప్రాంత రైతులకు ఎరువులు, పురుగుమందులు అందుబాటులోకి తీసుకువచ్చారు. త్రిపురాంతకంలో సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాంచ్ ఏర్పాటు చేశారు. ఆ ప్రాంత రైతులకు సమాఖ్య విస్తృతంగా సేవలందిస్తోంది.

నష్టాల బాట నుంచి లాభాల్లోకి...

వాకా బసివిరెడ్డి చైర్మన్‌గా నూతన కమిటీ ఏర్పాటు కాక ముందు సమాఖ్య నష్టాల్లో ఉంది. 2020 ఫిబ్రవరికి ముందు రూ.36,69,019 నష్టాల్లో ఉంది. పాలకమండలి ఏర్పాటైన తర్వాత అప్పట్లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్‌తో ఒప్పందాలు చేసుకుని రైతులకు అన్ని రకాలుగా సేవలందించేందుకు ముందుకొచ్చింది. ఎరువులు, పురుగుమందులను కంపెనీల వద్ద టోకుగా కొనుగోలు చేసుకుని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు సబ్సిడీపై అందజేస్తూ వచ్చింది. రైతులకు నేరుగా పొలం వద్దకే ఎరువులు సరఫరా చేస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకే ధాన్యంతో పాటు శనగ, మినుము, పత్తి, ఇతర ఉత్పత్తులను నేరుగా పొలంలోనే కొనుగోలు చేసి డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ పారదర్శకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటి వరకు కమీషన్ రూపంలో రూ.2,00,79,405 ఆదాయం సమకూర్చుకుంది.

- 2019–20లో రైతుల వద్ద నుంచి శనగలు, కందులు 29,71,300 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. అందుకోసం రైతులకు రూ.14,50,48,825 చెల్లించింది. దీని ద్వారా మార్క్‌ఫెడ్ నుంచి కమీషన్ రూపంలో సమాఖ్యకు రూ.7,11,724 ఆదాయం సమకూరింది
- 2019–20సంవత్సరంలో రైతుల వద్ద నుంచి 8,445 మెట్రిక్ టన్నుల ధాన్యంకొనుగోలు చేసింది.అందుకు గానూ పౌరసరఫరాల శాఖ నుంచి రూ.28,85,888 ఆదాయం కమీషన్ రూపంలో సమకూరింది.
- 2020–21 సంవత్సరంలో రైతుల నుంచి ధాన్యం 26,092 మెట్రికల్ టన్నులు కొనుగోలు చేసింది
- 2021–22 లో ధాన్యం 21,228 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. రైతులకు నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో ప్రభుత్వం నగదు జమ చేసింది.
- 2022–23, 2023–24 సంవత్సరాల్లోనూ రైతుల నుంచి ధాన్యం, శనగలు, కందులు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తోంది.

అందుబాటులో నాణ్యమైన ఎరువులు

సమాఖ్య ఆధ్వర్యంలో నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంచారు. ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఉన్న గోడౌన్‌ను అద్దెకు తీసుకుని ఎరువులను అందుబాటులో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా సమాఖ్య కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు 6 వేల మెట్రిక్ టన్నులకు పైగా శనగల, కందులు, ధాన్యం , మొక్కజొన్నలను మద్దతు ధరలకు రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఒంగోలు, యర్రగొండపాలెంలో గోడౌన్ ఏర్పాటు చేసి రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

పొగాకు రైతులకూ ఎరువుల సరఫరా...

డీసీఎంఎస్ ద్వారా పొగాకు రైతులకు అందించాల్సిన ఎరువులను ఈ ఏడాది పొగాకు వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్యకు ప్రభుత్వం అప్పగించింది. డీసీఎంఎస్‌లో అక్రమాలు జరగడంతో అందులోని ఉద్యోగులపై ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేసింది. దీంతో ఆ సంస్థ బాధ్యత కూడా సమాఖ్య తీసుకుంది. శుక్రవారం స్థానిక సమాఖ్య గోడౌన్‌లో జిల్లాలోని ఏడు పొగాకు వేలం కేంద్రాల రైతులకు ఎరువులను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

రైతుల పొలం వద్దకే ఎరువుల సరఫరా..



సమాఖ్య ఆధ్వర్యంలో రైతులకు పొలం వద్దకే ఎరువులను చెరవేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా గోడౌన్లు, బ్రాంచీలు ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన సేవలను చేరువ చేస్తున్నాం. తొలుత ఒంగోలు ఏఎంసీ ప్రాంగణంలో అద్దెకు గోడౌన్ తీసుకుని ఒంగోలు, మద్దిపాడు, కొత్తపట్నం, నాగులుప్పలపాడుతో పాటు పరిసర ప్రాంత మండలాల రైతులకు సేవలందిస్తూ వచ్చాం. ఆ తర్వాత నాగులుప్పలపాడులో సొంతంగా గోడౌన్ ఏర్పాటు చేసుకొని రైతులకు సబ్సిడీపై ఎరువులు అందిస్తున్నాం. ఇక త్రిపురాంతకంలో కూడా ప్రత్యేకంగా సమాఖ్య బ్రాంచి ఏర్పాటు చేసుకుని రైతులకు సేవలందిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలోని అన్ని పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని రైతులకు నేరుగా ఎరువులు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

– వాకా బసివిరెడ్డి, రాష్ట్ర చైర్మన్, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య

సమాజం పట్ల బాధ్యత అవసరం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



వెంకాయమ్మను సన్మానిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: సమాజం పట్ల విద్యార్థులకు బాధ్యతతో పాటు క్రమశిక్షణ అవసరమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకాయమ్మ మాట్లాడుతూ చదువంటే కేవలం పుస్తకాలు మాత్రమే కాదని, తోటివారి పట్ల గౌరవ మర్యాదలు, ప్రేమాభిమానాలు చూపాలన్నారు. కష్టపడే నైజాన్ని అలవాటు చేసుకోవాలని, చదువుపైనే దృష్టి సారిస్తూ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కళాశాలలోనే సెంటర్ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ స్థాపించనున్నట్లు తెలిపారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో సాంకేతిక విద్యను అందుబాటులోనికి తేవాలన్న లక్ష్యంతో తన తండ్రి సామ్యేల్ జార్జి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొట్టమొదటి కళాశాలను స్థాపించి ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోనికి తెచ్చారన్నారు. పలువురు పేద విద్యార్థులకు తాము ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా డాక్టర్ జార్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, డీన్ అకడమిక్, డాక్టర్ ఎం మస్తానయ్య, హెచ్ఓడీలు పాల్గొన్నారు. అనంతరం వెంకాయమ్మను మాజీ మంత్రి సురేష్ ఘనంగా సన్మానించారు.

దెబ్బతిన్న పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

- అగ్నాస్త్రంతో వరిలో ఉల్లికోడు నివారణ
- ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి

ఒంగోలు సబర్బన్: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిణి పేర్కొన్నారు. జిల్లాలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పొలాల్లో ముఖ్యంగా పత్తి, మిరప, కంది పొలాల్లో నిల్వ ఉన్న నీటిని పక్క మార్గం గుండా బయటకు పంపాలన్నారు. అనంతరం 50 కిలోల వేపపిండి, 100 కిలోల ఘన జీవామృతం, కిలో సూడోమోనాస్, కిలో ట్రైకోడర్మా విరిడి కలిపి పొలంలో చల్లాలని సూచించారు. 2 రోజుల తర్వాత చేపబెల్లం ద్రావణం కానీ, కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం కానీ పిచికారీ చేయాలన్నారు. వరిలో ఉల్లికోడు కనిపిస్తుందని, ఆలస్యంగా నాటిన వరిలో ఎక్కువగా ఉల్లికోడు లక్షణాలు కనిపిస్తున్నట్లు గుర్తించామన్నారు. నివారణ కోసం ఒక ఎకరానికి అగ్నాస్త్రం 3 లీటర్లు, 100 లీటర్ల నీటిలోకలిపి 5 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. 5 రోజుల తర్వాత జీవామృతం కానీ, ఫిష్ అమైనోయసిడి కానీ పిచికారీ చేయాలని సూచించారు. అందుకోసం వ్యవసాయ సబ్ డివిజన్‌ల వారీ గా ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని కలిసి రైతులు సలహాలు తీసుకోవాలి.

- ఒంగోలు సబ్‌డివిజన్, కె.నరసింహులు– 9000799855
- సింగరాయకొండ సబ్‌డివిజన్, బి.ఎస్తేరమ్మ–9381021071
- దర్శి సబ్‌డివిజన్, వై.మేరీడెబిల్లా– 7013017127, జే.ప్రభాకర్–8094555058
- కనిగిరి సబ్‌డివిజన్, డి.విజయరాణి–7013082798
- మార్కాపురం సబ్‌డివిజన్, డి.లలితమ్మ–9866982476
- గిద్దలూరు సబ్ డివిజన్, డి.మద్దిరెడ్డి–9441092197
- యర్రగొండపాలెం సబ్‌డివిజన్, ఆర్.మద్దయ్య–7004246562

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఒంగోలు వన్‌టౌన్: సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల గడువును పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షమ శాఖ సాధికారత అధికారి ఎస్ లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు, అభ్యర్థులకు శిక్షణ ఇచ్చే శిక్షణ సంస్థలు కుడా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన

- ఓపెన్ హౌస్‌లో పోలీసు ఆయుధాల ప్రదర్శన
- ఆశ్చర్యచకితులను చేసిన పోలీసు జాగిలాలు



విద్యార్థులకు పోలీసు ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసుల విధులు, వారు ఉపయోగించే ఆయుధాలు, బాధ్యతల గురించి విద్యార్థి దశలోనే అవగాహన కల్పించడానికి ఓపెన్ హౌస్ ఉపయోగపడుతుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలీసు కళ్యాణ మండపంలో పోలీసు ఆయుధాలను ప్రదర్శించారు. విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలు, వాటి పనితీరు, సాంకేతిక సాధనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీఎఫ్ రైఫిల్ , 380 రివాల్వర్ దగ్గర నుంచి బాంబు డిస్పోజబుల్ పరికరాలు, గ్యాస్ గ్రానైడ్ , త్రోయింగ్ వెహికల్స్, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు, కమ్యూనికేషన్ వాహం, 207 వజ్ర వాహనం, నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్ స్క్వాడ్ బృందాలు, ఫేక్ నోట్ డిటెక్టర్, బాడీ వోర్న్ కెమెరాలను ప్రదర్శించారు. ఈ ఆయుధాల పనితీరును ఆయన వివరించారు.

పోలీసు జాగిలాల విన్యాసాలు..

పోలీసు జాగిలాలతో నిర్వహించిన విన్యాసాలను విద్యార్థులను ఆశ్చర్యచకితులను చేశాయి. తొలుత చీటా, మ్యాగీ, జాకీ జాగిలాలు ఎస్పీకి గౌరవ వందనం చేశాయి. ఒబిడియన్స్ వ్యాయామం, పేలుడు పదార్థాలను ఉంచిన బాక్సులను గుర్తించాయి. విధి నిర్వహణలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా దాటుకుంటూ లక్ష్యాన్ని చేధించడం, హత్యలు, దొంగతనాలను గుర్తించడం లాంటి ప్రదర్శనలు నిర్వహించారు. ఈ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..శాంతి భద్రతల నిర్వాహణ అంశాన్ని విద్యార్థి దశలోనే తెలియజేయాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులు చక్కని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, తాలుకా సీఐ అజయ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక గ్రూపు సభ్యులకు కెనరా బ్యాంకు సౌజన్యంతో ఒంగోలు ఏ–1 కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన నారీశక్తి రుణమేళాలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఆర్థికంగా నిలబడేందుకు బ్యాంకులు అవసరమైన రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ నెలలో రూ.100 కోట్ల రుణాలు మంజూరు చేసేందుకు కెనరాబ్యాంకు ముందుకు వచ్చిందని తెలిపారు. మిగిలిన బ్యాంకులు కూడా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు క్రమశిక్షణకు మారుపేరని, ఇటీవల విజయవాడలో వరదలు సంభవించిన సమయంలో బాధితులకు అందించిన ఆహార తయారీలో ముందున్నారని కొనియాడారు. బ్యాంకు జీఎం మమత మాట్లాడుతూ రాష్ట్రంలో పొదుపు సంఘాలు క్రమంగా పెరుగుతున్నాయన్నారు. 40 ఏళ్ల క్రితం నెల్లూరులోని ఓ గ్రామంలో ప్రారంభమైన పొదుపు సంఘాలు అన్ని ప్రాంతాలకు విస్తరించాయన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని, ఇందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడానికి కెనరా బ్యాంక్ ముందుంటుందన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వసుంధర మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 32,657 ఎస్‌హెచ్‌జీలకు రూ.1671.02 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు ఇవ్వాలని లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. అక్టోబర్‌లో ఇప్పటి వరకు రూ.80.86 కోట్ల రుణాలు మంజూరు చేశారన్నారు. నెలాఖరు వరకు రూ.100 కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ఎల్‌డీఎం రమేష్ మాట్లాడుతూ పీఎంఎఫ్ఎంఈపీఎంఈజీపీ పథకాల కింద రూ.20 కోట్ల కెనరా బ్యాంకుఆర్థిక సాయంతో 100 యూనిట్లు స్థాపించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా వ్యక్తిగతంగా 500 యూనిట్లు ఏర్పాటు చేయడానికి గుర్తించామన్నారు. అనంతరం స్వయం సహాయక గ్రూపు మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, కెనరా బ్యాంకు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ పరిశఈలించారు. మహిళా పారిశ్రామికవేత్తలను సత్కరించారు. అనంతరం కెనరాబ్యాంకు ఎస్‌హెచ్‌జీ మహిళలకు మంజూరు చేసిన రూ.100 కోట్ల బ్యాంకు రుణం చెక్కును ఆవిష్కరించారు. కెనరా బ్యాంక్ ఏజీఎం శశిధర్, డీపీఎంలు సనీత, డేవిడ్ ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో భవిష్యత్‌కు మేలు



మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: జైలు జీవితాన్ని వృథా చేయకుండా సత్ప్రవర్తనతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి. వరుణారెడ్డి అన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అనే పథకంలో భాగంగా శుక్రవారం జిల్లా జైలులో గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి సంస్థ రూడ్‌సెట్ ఆధ్వర్యంలో ఖైదీలకు స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాని చెప్పారు. ప్రేరణ ఎన్జీఓ సంస్థ ప్రతినిధి నాగలక్ష్మి ఖైదీలు అసక్తి కలిగిన వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ఏసీ మెకానిక్, రిఫ్రిజిరేటర్ మెకానిజంలలో శిక్షణ అందించేందుకు ప్రతిపాదన చేశామన్నారు. అసక్తి కలిగిన ఖైదీలు తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జైలర్ వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కంబాలదిన్నె విద్యార్థులు

పామూరు: రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్–17, సైక్లింగ్ అండర్–14 పోటీలకు మండలంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మహబూబ్‌ఖాన్, పీఈటీ నరసింహారావు తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి మండలం గురువాజిపేటలో జరిగిన జిల్లాస్థాయి సైక్లింగ్ అండర్–14 విభాగంలో పాఠశాల విద్యార్థులు వై.ప్రవీణ్‌కుమార్, ఎం భవ్యజశ్విత ప్రతిభకనబరిచి రాష్ట్రపోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు 26వ తేదీన విజయవాడ నున్న జెడ్పీహెచ్ఎస్‌లో రాష్ట్రపోటీల్లో పాల్గొననున్నారు. ఒంగోలులో జరిగిన అండర్–17 కబడ్డీ జిల్లా పోటీల్లో కె.జగన్, ఎం మనీషాలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఈ నెల 27న కడపజిల్లా రాయచోటి జెడ్పీహెచ్ఎస్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణనిచ్చిన పీఈటీ నరసింహారావును, క్రీడాకారులను అభినందిచారు. సిద్ధమూర్తి లక్ష్మిరెడ్డి పలువురు పాల్గొన్నారు.